అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్

- ప్రతినిధులకు ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు
- కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోండి
- పోలీసులకు సిఎం రేవంత్ ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 8,9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించయోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఆదివారం సీఎం పరిశీలించారు. పోలీసులు, సంబంధిత అధికారులతో ఈ సందర్భంగా ఆయన సమీక్ష నిర్వహించారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచ వ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతారు. వివిధ దేశాల అంబాసిడర్లు కూడా పాల్గొనే అవకాశం ఉంది. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు. పాస్‌లు లేకుండా ఎవరు ఎంట్రీ కావడానికి వీలు లేదు. సమ్మిట్‌కు సంబంధం లేని వారికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదు. శాఖల వారీగా అధికారులకు ఎంట్రీ ఉంటుంది. ఏర్పాట్లను నేను ఎప్పటికప్పుడు పరిశీలిస్తాను. పోలీస్‌లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. పార్కింగ్‌కు ఇబ్బంది రావొద్దు. బందో బస్తుకు వచ్చే పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలి. సమ్మిట్‌కు హాజరయ్యే మీడియాకు తగిన ఏర్పాట్లు చేయాలి" అని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న భారత్ స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు.

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఎం రేవంత్

2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

రాష్ట్ర భవిష్యత్ చిత్రపటాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా, అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ సమ్మిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా రెండు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. తొలిరోజు ప్రభుత్వం సాధించిన విజయాల వివరాలను ప్రదర్శిస్తారు. రెండో రోజు తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ ఈవెంట్ కు పారిశ్రామిక వేత్తలు, బడా కంపెనీల ప్రతినిధులు తరలిరానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ విదేశాల నుండి దాదాపు రెండు వేల మంది ప్రముఖులు హాజరుకానున్నట్టు సర్కార్ అంచనా వేస్తోంది. తెలంగాణ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచడం, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. అంతర్జాతీయ స్థాయిలో తన విజన్, పాలసీలను ప్రదర్శించడానికి సమ్మిట్ ముఖ్య వేదిక కానుందని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ఏర్పాట్లు సైతం అదే రీతిలో ఉండేలా అన్ని చర్యలు చేపట్టింది.

కరణ ప్రేమ బోధించిన సత్యసాయి

- మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - కల్చరల్

సత్య సాయి బాబా మానవుడుగా ప్రేమ వాత్సల్యం బోధించి దైవ స్వరూపం గా నిలిచారు అని రాష్ట్ర పరిశ్రమల ఐ టి శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సత్య సాయి సేవా సంస్థల నిర్వాహణలో సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్ బాబు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు ప్రేమ తత్వం కరుణ ముఖ్యమనీ సత్య సాయి బోధించి ఆచరణలో చూపారని చెప్పారు. మారుతున్న సమాజిక విలువలు సందర్భంలో సత్య సాయి బాబా ఆలోచనలను అనుసరిస్తే శాంతి నెలకొంటుందని అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్‌లో గంటల తరబడి రీల్స్ ట్విట్టర్‌లకు అతుక్కు పోతున్నారని, వారు కొంత సమయం వెచ్చించి సత్య సాయి బాబా బోధనల రీల్స్ చూడాలని అపుడు కలిగే అధ్యాత్మిక భావన వారిలో మార్పు తెస్తుందని చెప్పారు. సత్యసాయి బాబా సేవా సంస్థలు ప్రతినిధి పూర్వ డిజిపి హెచ్‌జె దొర మాట్లాడుతూ సత్య సాయి బాబా బోధనల వింటే గొప్ప పరివర్ధన కలుగుతుందని అన్నారు. ఎన్నో మారుమూల దేశాల నుంచి వచ్చిన వారు సత్య సాయిబాబా ప్రశాంతి నిలయంలో ఉండి, వారి ఆహార అలవాట్లు మాని అక్కడ సేవా కార్యక్రమాలలో పాల్గొనటం.. సాయికి వున్న ఆకర్షణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు మాట్లాడుతూ పేదలకి అభాగ్యులకి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో వైద్యం అందిస్తూ సాయి బాబా ట్రస్ట్ చేస్తున సేవ బాబా తాగు నీరు కోసం అందించిన సహకారం ప్రశంస నీయమన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మెర ప్రభుత్వం బాబా శత జయంతి వేడుకలకు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ మాట్లాడుతూ సమాజానికి మంచి చేసే వారు దైవ స్వరూపమని అన్నారు. ప్రభుత్వం సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు ప్రభుత్వ కార్యక్రమంగా జరుపడం విశేషమన్నారు.

మారథాన్‌లో మంత్రి వాకిటి శ్రీహరి

జిపిఒలు ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలి : వి లచ్చిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పాలన అధికారులు ప్రజా ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి సూచించారు. గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తేనే క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని రాష్ట్ర సర్కారు భావిస్తోందన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ (జిపిఒఎటిజి) ఆవిర్భావ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యమవుతున్న పరిస్థితి నుంచి ప్రభుత్వ సహకారంతో రెవెన్యూ వ్యవస్థను గ్రామగ్రామాన పునర్నిర్మాణమవుతున్నదని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను కాపాడుకునేందుకు అందరూ సంఘటితం కావాలనీ, ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యం అవుతుందని చెప్పారు. జీపీవోలు అంకిత భావంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని రెవెన్యూ, భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. జిపిఒలలో ఏ ఒక్కరు తప్పు చేసినా మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పదోన్నతుల విషయంలో కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జిపిఒఎటిజి సలహాదారులు, ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ కో-చైర్మన్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ, టిజిటిఎ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, పాక రమేష్, టిజిఆర్ఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి వి.బిక్షం, టిజిఆర్ఎస్ఎ రాష్ట్రం కోశాధికారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం

- అనేక దేశాల్లో యుద్ధ వాతావరణం
- ఇండియాలో పెరిగిన ఆర్థిక అసమానతలు, పేదరికం
- 'స్థానిక' పోరాటాలతోనే పార్టీ బలోపేతం : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో యుద్ధ వాతావరణం, ఆర్థిక సంక్షోభం నెలకొన్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఫ్రాన్స్ తదితర దేశాల్లో ఆర్థిక విధానాలు, పెట్టుబడిదారీ విధానాలు, నిరుద్యోగానికి వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయని తెలిపారు. ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇసిఐఎల్ కమలానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇజ్రాయిల్-పాలస్తీనా మీద చేస్తున్న దాడుల్లో మహిళలు, పసిపిల్లలు చాలా మంది చనిపోతున్నారని తెలిపారు. కాల్పుల ఒప్పందం చేసుకుని కూడా ఇజ్రాయిల్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడిందన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా మూడేళ్లుగా కొనసాగుతుందని తెలిపారు. ఉక్రెయిన్ నాటో దేశాల్లో కలవకుండా ఉంటే యుద్ధం ఆపేస్తామని రష్యా చెప్పిందనీ, సమస్య ఇంకా పరిష్కారం కాలేదన్నారు. అమెరికాలో ఆర్థిక సంక్షోభం, ఆర్థిక అసమానతలు ఉన్నాయన్నారు. అమెరికా అనేక దేశాల మీద ఆంక్షలను విధిస్తూ అవి అమలు చేయకపోతే ఆ దేశాల మీద అధికంగా సుంకాలు మోపుతూ తమ దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇండియాపై కూడా రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయరాదని ఆంక్షలు విధించిందని, దానికి మోడీ ప్రభుత్వం భయపడి రష్యా నుంచి ఆయిల్ కొనకుండా అమెరికా నుంచి కొంటుందన్నారు. చైనా మీద కూడా ఆంక్షలు విధిస్తే అంతే ఘాటుగా చైనా స్పందించారు.

భారత్‌లోనూ ఆర్థిక అసమానతలు బాగా పెరిగాయని జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వ నిర్ణయాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. దేశంలో తీవ్రమైన పేదరికం కొనసాగుతోందని, ఆర్థిక అసమానతల నిర్మూలనకు ఎలాంటి ప్రణాళిక లేదన్నారు. నిరుద్యోగం పెరుగుతోందనీ, వ్యవసాయ పనులకు నిధుల కొరత ఉందనీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు నిధులు తగ్గించారనీ, ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుకు అప్పగించేందుకు కుట్ర జరుగుతోందనీ విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో ఎలక్షన్ కమిషన్ పూర్తిగా వారికి అనుకూలంగా పని చేస్తుందన్నారు. తెలిపారు. 'సర్' పేరు మీద బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని తెలిపారు. బిజెపికి అనుకూలంగా లేని ఓట్లను తొలగించడంతోనే బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం గెలిచిందన్నారు. అనేక రాష్ట్రాల్లో సర్ ప్రక్రియని చేపడుతున్నామని ఎలక్షన్ కమిషన్ ప్రకటించడాన్ని తమిళనాడు, వెస్ట్ బెంగాల్ తదితర రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఆర్ఎస్ఎస్ భావాలతో హిందూ దేశంగా మార్చేందుకు బిజెపి కుట్ర చేస్తుందన్నారు. గిట్టుబాటు ధర లేక పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూ ఉంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మోడీ ప్రభుత్వం ట్రంపునకు పూర్తిగా లొంగిపోయి మనకి అవసరం లేకున్నా పత్తి, సోయాబీన్, పాలు ఇంకా అనేక రకాల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటామని ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఇక్కడి రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. చత్తీస్‌గఢ్‌లో ఉన్న ఖనిజాలు, భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగారు పేరుతో కుట్ర జరుగుతోందన్నారు. మావోయిస్టును బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తున్నారనీ, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలన అంత ఆశాజనకంగా లేదన్నారు. హామీల అమలులో విఫలం కావడంతో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మతోన్మాద అంశాలను బిజెపి వాడుకునేందుకు ప్రయత్నం చేసిందని తెలిపారు. తెలంగాణలో బిజెపి ప్రమాదం పెరుగుతోందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల మీద పోరాటాలు చేయాల్సిన అవసరం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు ఏ.అశోక్, ఎం.వినోద, జి. శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్యతెలంగాణ సాధనలో భాగంగా క్రీడల పట్ల ప్రభుత్వం విస్తృతంగా చర్యలు తీసుకుంటోందని క్రీడలు, యువజన సర్వీసులశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని హయగ్రీవాచారి స్టేడియంలో ఆదివారం నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయి వరంగల్ సహకారంతో తెలంగాణ రన్నర్, వరంగల్ రన్నర్ అసోసియేషన్ నిర్వహించిన వరంగల్ ఫస్ట్ ఎడిషన్ హాఫ్ మారథాన్‌లో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రీడలు జీవనశైలిలో భాగం కావాలని, ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం, క్రీడలు తప్పనిసరి అని అన్నారు. వారసత్వ సంపద కలిగి ఉన్న వరంగల్ నగరంలో ఇంత పెద్ద హాఫ్ మారథాన్ నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేల కృషితో వరంగల్‌లో స్టేడియం, క్రీడా పాఠశాల ఏర్పాటు జరగడం నగరానికి మరో ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని క్రీడా మైదానాలను ప్రపంచ స్థాయి హంగులతో అభివృద్ధి చేస్తున్నామని, హాఫ్ మారథాన్ వల్ల వరంగల్ నగరం ప్రపంచ వేదికపై గుర్తింపు పొందుతుందన్నారు. ఆరోగ్యం, మత్తు పదార్థాల విముక్తి సందేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. తెలంగాణలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నూతన స్పోర్ట్స్ పాలసీ రూపకల్పన చేస్తున్నారని అన్నారు. సీఎం కప్ పేరిట గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయికి క్రీడా ప్రతిభను గుర్తించే కార్యక్రమాలను చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ హాఫ్ మారథాన్‌లో మొత్తం 2600 మంది క్రీడాకారులు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదయం 5:30 గంటలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాఫ్ మారథాన్‌కు జెండా ఊపగా, అనంతరం 5 కిమీ రన్‌ను మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కూడా చైర్మెన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అజీజ్ ఖాన్, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఇసి సభ్యులు ఇవి శ్రీనివాస్‌రావు, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కులపై నేడు రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ (ఎన్‌సిపిసిఆర్), పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా ఒక రోజు రాష్ట్రస్థాయి సదస్సును సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్‌లో నిర్వహిస్తున్నది. ఈ సదస్సులో పాఠశాలల్లో బాలల భద్రత, విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఆరోగ్య సమస్యలు, జువనైల్ జస్టిస్ చట్టం, పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం (పోక్సో యాక్ట్) అమలులో ఎదురవుతున్న లోపాలు తదితర అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్ర విద్యారంగంలో బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం, సంస్థాగత ప్రతిస్పందనలను మెరుగుపరచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో దాదాపు 230 మంది వివిధ రంగాల్లో కీలక భూమిక పోషిస్తున్నవారు పాల్గొననున్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి, బాలల సంక్షేమ అధికారి, ఎపిసి సభ్యులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాధికారులు భాగస్వాములు కానున్నారు. ఈ సదస్సులో బాలల రక్షణ వ్యవస్థలు, పాఠశాల వ్యవస్థ మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంపై ప్రత్యేకంగా చర్చించనున్నారు.

'టార్పాలిన్‌లు' మాయం !?

- జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ జిల్లాలో ఐకెపి, పిఎస్ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షాలకు రైతుల ధాన్యం తడవకుండా ఇవ్వాల్సిన టార్పాలిన్‌లు మాయం అయ్యాయి. జనగామవ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం నుండి జిల్లావ్యాప్తంగా పంపిణీ కావాల్సిన టార్పాలిన్‌లలో అవకతవకలు జరగడం చర్చనీయాంశమైంది. దీన్నుండికప్పి పుచ్చుకునేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నట్టు తెలుస్తోంది.

జనగామ మార్కెట్ యార్డులో అధికారులు, జనగామ జిల్లా మార్కెటింగ్ అధికారి పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల, పాలకుర్తి, జనగామ వ్యవసాయ మార్కెట్ యాడ్‌లకు జిల్లా కేంద్రంలోని డిఎంఓ కార్యాలయం నుండి టార్పాలిన్‌లు సరఫరా అవుతున్నాయి. కాగా, జనగామ మార్కెట్ యార్డ్ నుండి పంపిణీ అయ్యే టార్పాలిన్‌ల విషయంలో లెక్కల్లో తేడా చూపినట్లు తెలిసింది. జనగామ మార్కెట్ యార్డులో అవినీతికి పాల్పడడమే కాకుండాటార్పాలిన్‌లు, వస్తువులు అమ్ముకునే కాడికి దిగజారినట్లు విమర్శలు వస్తున్నాయి. అవకతవకలు, అవినీతి పై అనేకమార్లు సంబంధిత అధికారులు సస్పెండ్ అవుతున్నప్పటికీ, అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. వరుసగా మార్కెట్‌సెక్రటరీలు సస్పెన్షన్, బదిలీల వేటు జరుగుతున్నప్పటికీని మార్కెట్ యార్డ్ సిబ్బంది, అధికారులలో ఎలాంటి మార్పులు రావడం లేదని విమర్శలు వస్తున్నాయి. కేవలం జనగామ మార్కెట్ యార్డ్ లోనే సుమారు 1500కు పైగా అమ్ముకున్నారని సమాచారం. రెండు నెలల క్రితం జనగామ మార్కెట్ యార్డులోని ఒక అర్థివ్యాపారుని సహాయంతో 200 కొత్త టార్పాలిన్లు రూ.రెండు వేలకు ఒకటి చొప్పున అమ్మి రూ.4లక్షలు సొమ్ము చేసుకున్నట్టు 15 రోజుల క్రితం లెక్కలు చూస్తే తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం ఈ విషయం బయటపడకుండా ఉండేందుకు 200కు పైగా టార్పాలిన్‌లు జిల్లాలోని మరో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుండి తెప్పించారిన పుకార్లు వినిపించాయి. ఇదే కాకుండా మార్కెట్ యార్డ్ కార్యాలయంలో కొనుగోలు చేసిన 100 కుర్చీలలో 50 కుర్చీలకు పైగా మాయమైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి ల భూక్య చందు నాయక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

మార్కెట్ యార్డు లోని టార్పాలిన్‌లు మాయం చేసి అమ్ముకున్న విషయంలో విచారణ చేపట్టి బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలి. రైతుల ధాన్యం తడవకుండా రక్షణ కోసం ఇవ్వాల్సిన తార్పాలిన్లు అమ్ముకోవడం సిగ్గుచేటు. అవినీతి, అక్రమాలకు, అవకతవకలకు పాల్పడే అధికారుల, సిబ్బంది పట్ల మార్కెట్ చైర్మన్ కఠినంగా ఉండాలి. తార్పాలిన్ల మాయం చేసిన విషయంలో బాధ్యులను కాపాడేందుకు ప్రయత్నించకుండా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

విచారించి చర్యలు తీసుకుంటాం : నరేందర్, డిఎంఒ

జనగామ మార్కెట్ యార్డులో టార్పాలిన్‌లు మాయం అయ్యాయని విషయంలో విచారించి చర్యలు తీసుకుంటాం. విచారణలో తప్పు జరిగిందని తేలితే శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయి.

నూతన విద్యా విధానం ఆమోదించొద్దు

- రాష్ట్ర ప్రభుత్వానికి టిఎస్‌పిటిఎ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఛాందస ఉన్మాద సిద్ధాంతాలతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో ఆమోదించవద్దని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టిఎస్‌పిటిఎ) రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్ అలీ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కార్యనిర్వాహక కౌన్సిల్ సమావేశంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. యంగ్ ఇండియా పేరుతో నూతన విద్యా విధానాన్ని ఆమోదించేలా ఏర్పాట్లు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్ర ప్రభుత్వాలు బలవంతంగా నూతన విద్యా విధానం అమలు చేయాలని కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను ప్రజాస్వామికవాదులు, మేధావులు వ్యతిరేకించాలని కోరారు. గతంలో ఇలాంటి వ్యతిరేకత వల్లే పక్కన పెట్టిన ఆ విధానాన్ని సీఎం చాపకింద నీరులా అమలు చేయాలని చూస్తున్నారని తెలిపారు. 10 వేల ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను,, పెండింగ్‌లో ఉన్న 5 డిఎ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర శాఖ కార్యవర్గంలో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల ద్వారా ఏర్పడిన ఐదు ఖాళీలను భర్తీ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇప్పటి వరకు ఇంచార్జీ ఉన్న ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.రోహిత్ నాయక్‌ను ప్రధాన కార్యదర్శిగా ఆమోదించారు. నూతన కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం విద్యారంగంలో ఉన్న 15 అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తీర్మానాలు ఆమోదించారు.

అభివృద్ధి వంతెన ఎక్కని ఆశలు

- ఆ మత సామరస్య కేంద్రంలో వద్ద నిత్యం నరకం!
- 'గేటు' దాటాలంటే గుండెల నిండా భయం
- 'వంతెన' కోసం కన్నీళ్లతో నిరీక్షణ
- ఇదీ దర్గా కాజీపేట జాగీర్ 48వ డివిజన్ దుస్థితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మా ప్రాంతానికి ఒక చరిత్ర ఉంది. దేశంలోనే ప్రముఖమైన మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. కానీ ఈ చరిత్ర, ఈ ఘనత మా సమస్యల ముందు చిన్నబోయింది. అభివృద్ధి మాకు ఆమడ దూరంలో నిలిచిపోయింది. రోజూ నరకం చూస్తున్నాం." - ఇది హనుమకొండ జిల్లా 48వ డివిజన్‌లోని దర్గా కాజీపేట జాగీర్ ప్రజల ఆవేదన.

"మా బంధువు ఒకరికి గుండె నొప్పి రావడంతో అర్జెంట్‌గా ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. సరిగ్గా అదే సమయానికి గేటు పడింది. ఆ గేటు దాటేసరికే ఆలస్యమై, అతను ప్రాణాలు కోల్పోయారు. ఆ బాధ ఇప్పటికీ వెంటాడుతోంది. మేము రోజూ మృత్యువు అంచున నిలబడి రైలు గేటు తెరవాలని దేవుడిని వేడుకుంటున్నాం." అని గాంధీనగర్‌కు చెందిన ఓ స్థానికుడు కన్నీటితో చెప్పారు.

"మా చిన్న పిల్లలను ఒంటరిగా బయటికి పంపాలంటే గుండె దడ. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రోజూ భయంతో బతుకుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశించినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు." అంటూ ఓ స్థానికులు కంటతడి..

దర్గా కాజీపేట జాగీర్ 48వ డివిజన్.. ఒకప్పుడు ఈ ప్రాంతం విద్యకు కాణాచి. జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిల పిల్లలు ఇక్కడి పాఠశాలల్లో చదివేవారు. ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇక్కడే ఇండ్లు కొనుక్కొని, కిరాయికి ఉండి చదివించేవారు. ప్రసిద్ధమైన దర్గా, చర్చి, దేవాలయాలు.. హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఒకే కుటుంబంలా కలిసిమెలిసి జీవించే ప్రాంతం ఇది. ఈ డివిజన్ ప్రజల దైనందిన జీవితాన్ని శాసిస్తున్న అతిపెద్ద సమస్య.. దర్గా రైల్వే గేటు. ఈ మార్గంలో రోజుకు 150కు పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. రైలు గేటు పడిందంటే, ఒక్కోసారి గంటకు పైగా అక్కడే నిలబడాలి. అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లే రోగులు, పరీక్ష సమయానికి చేరుకోవాల్సిన విద్యార్థులు, పనులకు వెళ్లే కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయం. ఈ పరిస్థితుల్లో రైల్వే గేటు సమస్యకు శాశ్వత పరిష్కారంగా దర్గా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఒబి) నిర్మాణం మొదలైంది. కానీ, అది అసంపూర్తిగా నిలిచిపోయింది. మరోవైపు, ఫాతిమానగర్ బ్రిడ్జి పనులు కూడా పూర్తి కాక, ఇరుకైన పాత బ్రిడ్జిపై ట్రాఫిక్‌తో కిలోమీటర్ల కొద్దీ బారులు తీరుతున్నాయి. 'వంతెనలు కడితే మా కష్టాలు తీరుతాయని ఆశ పడితే, ఆ వంతెనల నిర్మాణమే మాకు సమస్యగా మారింది' అని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అంతేకాదు, అండర్ బ్రిడ్జి కల కూడా కలగానే మిగిలింది.

సమస్యలతో సతమతం

"వర్షం పడిందంటే చాలు.. పిల్లలను స్కూళ్లకు పంపాలంటే భయం. మత్తడిపై కల్వర్టు నిర్మించమని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు లేరు," అని ఓ తల్లి వాపోయింది. వర్షాకాలం వస్తే దంతం చెరువు మత్తడి ఉగ్రరూపం దాలుస్తుంది. మత్తడి ఉధృతికి దర్గా నుంచి చుట్టుపక్కల గ్రామాలైన బట్టుపల్లి, కడిపికొండలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. పిల్లల చదువులకు, ప్రజల పనులకు ఆటంకం కలుగుతోంది. అంతేకాదు, రోడ్లు, డ్రయినేజీల సమస్యలూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. పైపులైన్ల కోసం తవ్విన గుంతలను పూడ్చకపోవడంతో రోడ్లు నరకప్రాయంగా మారాయి. ముళ్ల చెట్లు పెరిగి, కనీస సదుపాయాలు లేని శ్మశాన వాటికల దుస్థితి చూసి, చివరి ప్రయాణంలో కూడా ప్రశాంతత లేదా అని స్థానికులు విలపిస్తున్నారు. అంతకంటే ఘోరం వీధి కుక్కల బెడద.. దర్గా నుంచి ఫాతిమానగర్ వెళ్లే దారి, అఫ్జల్ నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఈ కుక్కల దాడిలో చాలామంది గాయపడ్డారు.. కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హామీలు ఇస్తున్నారు. దర్గా ఆర్‌ఓబీ త్వరలో పూర్తవుతుందని, కొత్త రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. కానీ, ఆ హామీలు ఎప్పటికి కార్యరూపం దాలుస్తాయోనని 48వ డివిజన్ ప్రజలు ఆశగా, ఆందోళనగా ఎదురుచూస్తున్నారు.

ప్రజలు ఇబ్బందులను పరిష్కరించండి..

స్థానిక ప్రజలు దర్గా రైల్వే గేటుతో ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా నిర్మిస్తున్న దర్గా ఆర్‌ఒబి బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి. దర్గా అండర్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రజా ప్రతినిధులు, అధికారుల వాస్తవ అభిప్రాయాలు, నిర్ణయాలు అధికారికంగా ప్రకటించి ప్రజల్లో అపోహలను తొలగించాలి. డివిజన్‌లోని అంతర్గత సిసి రోడ్లు, డ్రయినేజీల నిర్మాణం, మరమ్మత్తులు చేపట్టాలి. ఎన్‌ఐటీ దర్గా 150 ఫీట్ల కొత్త రోడ్డును లైట్స్‌తో ఫోర్ లైన్స్‌తో అభివృద్ధి చేయాలి. దంతం చెరువు మత్తడిపై కల్వర్టు నిర్మించాలి. దర్గా నుంచి పవన్ నగర్ పిహెచ్‌సికి వెళ్లే కనెక్టివిటీ రోడ్డుకు ఉన్న అడ్డంకులను పరిష్కరించాలి. శ్మశాన వాటికలను ఆధునికరించాలి. ఫాతిమా నగర్ ఆర్‌ఒబి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.

-ఎం చుక్కయ్య, సిపిఎం జిల్లా నాయకులు

త్వరితగతిన బ్రిడ్జి పూర్తి చేస్తాం...

కొన్ని కోర్టు కేసులు, భూసేకరణ సమస్యల వల్ల దర్గా ఆర్‌ఓబీ బ్రిడ్జి పనుల్లో కొంత ఆలస్యం జరిగింది. ప్రస్తుతం అన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. రైల్వే ట్రాక్ పైన నిర్మాణానికి రైల్వేశాఖ అప్రూవల్ కూడా ఇచ్చింది. దర్గా ఆర్‌ఒబి బ్రిడ్జి పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరితగతిన బ్రిడ్జ్ నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. దర్గా రైల్వే అండర్ బ్రిడ్జి గురించి ఆర్‌అండ్‌బి శాఖ వద్ద ఎలాంటి సమాచారం లేదు. ఈ విషయం గురించి తెలియదు. ఎన్‌ఐటి 150 ఫీట్ల దర్గా కొత్త రోడ్డులో రూ.7.50 కోట్లతో చేపట్టే ఫోర్ లైన్స్ రోడ్డు నిర్మాణం పనులనూ త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభిస్తారు. ఫాతిమా నగర్ ఆర్‌ఓబీ బ్రిడ్జి పనులూ వేగంగా జరుగుతున్నాయి. బ్రిడ్జి పైన కూర్చుండబెట్టే రెండు గడ్డర్స్ నిర్మాణం పూర్తయింది.

- సురేష్ బాబు, ఇఇ. ఆర్‌అండ్‌బీ

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

డివిజన్‌లో పైప్‌లైన్‌ల కోసం తవ్విన రోడ్ల, డ్రయినేజీల నిర్మాణ మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అదే విధంగా దర్గా ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి రూ.30 లక్షలతో సిసి రోడ్డు, సిసి డ్రైనేజీల నిర్మాణానికి అనుమతి లభించింది. త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తాం.

- ఎఇ విజయలక్ష్మి, జిడబ్ల్యుఎంసి, కాజీపేట

ఉదయం కూతురి మరణం... సాయంత్రం తల్లి ఆత్మహత్య

- శోకసంద్రంలో కుటుంబం..
- ఎల్గోయి గ్రామంలో విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు అనారోగ్యానికి గురై కండ్ల ముందే మరణించడంతో దాన్ని జీర్ణించుకోలేక తల్లి ఆత్మహత్య చేసుకున్న హృదయ విదాయకర ఘటన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్ఐ పాటీల్ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని వెంకట్, లావణ్య దంపతుల కూతురు వైష్ణవి(3).. నిమోనియా వ్యాధితో బాధపడుతుంది. దాంతో తమ కూతురిని నీలోఫర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మరణించింది. చిన్నారి అంత్యక్రియలు స్వగ్రామం ఎల్గోయిలో నిర్వహించారు. అంత్యక్రియల అనంతరం బంధువులు అందరూ వెళ్ళిపోయిన తర్వాత కూతురు మరణాన్ని జీర్ణించుకోలేని తల్లి లావణ్య(28) ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం కూతురు, సాయంత్రం తల్లి మరణించడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగింది. ఈ ఘటనతో గ్రామంలో విషాధఛాయలు నెలకొన్నాయి. మృతురాలి భర్త బోయిని వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కార్మిక కోడ్‌లపై పత్రికల్లో మోసపూరిత ప్రకటనలు

- జాతీయ కార్మిక సంఘాలు
- కార్మిక కోడ్‌ల రద్దుకు 26న ఇందిరా పార్కు వద్ద ధర్నా

సమావేశంలో అభివాదం చేస్తున్న జాతీయ కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు కార్మిక కోడ్‌లను కార్మికుల సంక్షేమానికి తెచ్చామని కేంద్ర ప్రభుత్వం పత్రికల్లో మోసపూరితమైన ప్రకటనలు చేస్తున్నదని, వీటిని కార్మికవర్గం నమ్మాల్సిన అవసరం లేదని, ఈ లేబర్ కోడ్‌లు యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని జాతీయ కార్మిక సంఘాలు స్పష్టంచేశాయి. ఆదివారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ అధ్యక్షతన జాతీయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు జె.వెంకటేష్, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం, ఐఎఫ్‌టియు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కనీస వేతనాల సలహా మండలి బోర్డు చైర్మన్ జనకప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి బి వెంకటేశం, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కృష్ణ, విజయ్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు భరత్ హాజరై కోడ్‌ల రద్దుకు అవలంబించాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు.

మహిళలకు రాత్రిపూట డ్యూటీ చేసుకునే అవకాశం కల్పించామని కేంద్ర ప్రభుత్వం గర్వంగా చెప్పుకుంటున్నదని, గత చట్టాల్లో ఉన్న కొన్ని అంశాలను కోడ్‌లలో పొందుపరిచామని చెప్తున్నారని, వీటిని నమ్మాల్సిన అవసరం లేదన్నారు. 44 కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేసి 29 చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని తెలిపారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికులు యాజమాన్యాల ముందు బానిసల్లాగా బతకాల్సిన పరిస్థితులు వస్తున్నాయన్నారు. కోడ్‌లలో 12 గంటల పని విధానం ఉందని, చట్టబద్ధంగా సమ్మె చేసే హక్కు లేదని తెలిపారు. కాలపరిమితితో కూడుకున్న ఉద్యోగ నియామకాల అంశం ఉందని, పర్మినెంట్ ఉద్యోగాలు లేవని, ఉద్యోగ కాలాన్ని నిర్ణయించే అధికారం యాజమాన్యాలకు కల్పించటం దుర్మార్గమని అన్నారు. యూనియన్ పెట్టుకునే అవకాశం లేకుండా చేశారని చెప్పారు. యాజమాన్యం యూనియన్‌ను గుర్తించాలంటే కంపెనీలో పని చేస్తున్న కార్మికుల్లో 52 శాతం సంతకాలు పెడితేనే యూనియన్ రిజిస్ట్రేషన్ అవుతుందని కోడ్‌లో పొందుపరిచారన్నారు. ఈ నిబంధనతో ఒక్క కంపెనీలో ఒక్క యూనియన్ గుర్తింపు పొందే అవకాశం లేదన్నారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించటానికి ఒక సంక్షేమ కమిటీ వేస్తామని, ఆ కమిటీకి అధ్యక్షునిగా ఉండాల్సిన వ్యక్తిని యాజమాన్యం నియమిస్తుందని కోడ్‌లలో పొందుపరచడం సిగ్గు చేట్టన్నారు. గతంలో వ్యాపార సంస్థల్లో కార్మికుల సంక్షేమం, జీతభత్యాలు సక్రమంగా చెల్లిస్తున్నారా? లేదా? అనే అంశాలపై లేబర్ ఇన్‌స్పెక్టర్లు ఉండేవారని, ఇప్పుడు వారిని ఫెసిలిటేటర్ కమ్ ఇన్‌స్పెక్టర్‌గా పేరుమార్చి వారికున్న అధికారాలు కత్తిరించారని విమర్శించారు. గత చట్టాల్లో ఉన్న సామాజిక భద్రతను తగ్గించారని తెలిపారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947లో చాప్టర్ 5బీలో 100 మంది కంటే ఎక్కువ కార్మికులున్న పరిశ్రమను మూసి వేయాలన్నా, కార్మికుల్ని తొలగించాలన్నా, లే ఆఫ్ ఇవ్వాలన్నా, ఆ కంపెనీ యాజమాన్యం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, కానీ ఈ సంఖ్యను 100 నుంచి 300లకు పెంచుకునే అవకాశాన్ని యాజమాన్యాలకే కట్టబెట్టారని అన్నారు. కోర్టుకు పోయే హక్కును సైతం తొలగించి ఇద్దరు సభ్యుల ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారని తెలిపారు. ఈ అంశాల వల్ల కార్మికుల హక్కులు పరిష్కారం కావటానికి చాలా సమయం పడుతుందని, యూనియన్లు భవిష్యత్తులో ఉండే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ ఉనికిలో లేకుంటే కార్మికులు స్వతంత్రంగా పోరాటం చేయలేరని తెలిపారు. యూనియన్లే లేకుండా చేస్తే యాజమాన్యాలు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చునని కేంద్రంలోని బిజెపి నాయకత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ ప్రయత్నాలకు ప్రతిఘటనగా ఈ నెల 26వ తేదీన ఇందిరా పార్కు వద్ద సంయుక్త రైతు సంఘాలతో కలిసి అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శంషాబాద్‌లో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్

- అప్రమత్తమైన అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలోని కస్టమర్ సపోర్ట్ ఐడీకి ఆదివారం బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలకు బహరేన్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చే విమానం జీఎఫ్-274 ఉదయం 11:31కి హైదరాబాద్ చేరుకుంది. ఆ విమానంలో 154 మంది ప్రయాణీకులు ఉన్నారు. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న విమానంలో బాంబు పెట్టినట్టు మెయిల్ రావడంతో ఎయిర్‌పోర్టు అధికారులు అప్రమత్తమయ్యారు. విమానం దిగిన తర్వాత పరిశీలించి, తనిఖీలు చేసి విమానాన్ని ముంబైకి మళ్ళించారు.

మౌలానా అబుల్ కలాం సేవలు అమూల్యం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతదేశ స్వాతంత్ర సమరంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చేసిన సేవలు అమూల్యమైనవని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని టోలిచౌకిలో తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ (మేవా) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మారక సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సమరం దండి సత్యాగ్రహం నిర్వహించినప్పుడు అబుల్ కలాం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఉన్నారని గుర్తు చేశారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన ప్రవేశ పెట్టిన సంస్కరణలు విద్యా విధానానికి ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. రిటైర్డ్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ ఎంజి అక్బర్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యా విలువలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలందించిన 65 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను ఉత్తమ సేవా అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫరూక్ హుస్సేన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వహీద్ షా, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మౌజమ్ అలీ ఖాన్, రాష్ట్ర నాయకులు మహమ్మద్ జావిద్ అలీ, తఫియోద్దీన్, హిదాయత్ అలీ, ఆరిఫ్, అమీర్ పాష తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి మెదక్‌లో సిఐటియు రాష్ట్ర మహాసభ

- మొదటి రోజు కార్మిక కవాతు..బహిరంగ సభ
- ముఖ్య అతిథిగా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి వి రాఘవులు
- నాలుగు లేబర్ కోడ్‌లపై పోరాటాలకు సన్నద్ధం
- జయప్రదం చేయాలని నేతల పిలుపు

మహా సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర ఐదో మహాసభలు వచ్చేనెల 7 నుంచి 9 వరకు మెదక్ పట్టణంలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత కార్మికులు తమ పని ప్రదేశాల్లో 'హలో కార్మికా..చలో మెదక్' అంటూ విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఏడున నిర్వహించతలపెట్టిన రెడ్ షర్ట్ వాలంటీర్ల, కార్మిక ర్యాలీ జరగనున్నాయి. బహిరంగసభకు తరలి వచ్చేందుకు కార్మికులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సభకు ముఖ్య వక్తగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరు కానున్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, కార్యదర్శులు జె చంద్రశేఖర్, కూరపాటి రమేష్, పి.శ్రీకాంత్, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు ఎం అడివయ్య, రాష్ట్ర నాయకుడు పి సుధాకర్‌లతో కలిసి ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ మహాసభలను ఒక కీలకమైన సందర్భంలో మహాసభలను జరుపుకుంటున్నామన్నారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం మొత్తం కార్మిక వర్గానికి ఉచ్చు బిగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమానుల, కార్పొరేట్ల గరెసెల్లోకి లాభాల వరద పారించేందుకు కార్మిక హక్కులకు పాడె కట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల కనుసన్నల్లో సాగుతున్న మోడీ పాలన..కార్మిక వర్గ పోరాటాలతో మట్టికొట్టుకుపోక తప్పదని హెచ్చరించారు. కార్మిక హక్కులను తుంగలో తొక్కుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేయకుండా తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఆ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయటం వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్ట పోతుందనీ, అందుకే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పక్షామో? యాజమానుల పక్షమో తేల్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పనిగంటలు పెంచుకునేందుకు కార్పొరేట్లకు అనుకూల జీవోలను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. మహాసభలకు 33 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరు అవుతున్నారని తెలిపారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె హేమలత, జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపి తపన్ సేన్, జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు హాజరవుతున్నారని తెలిపారు. మహాసభల నిర్వహణ కోసం ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఆ మహాసభల్లో వివిధ రంగాల్లో, వివిధ పేర్లతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై చర్చలు కొనసాగుతాయని తెలిపారు. గుర్తించిన సమస్యలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కానున్నట్టు పేర్కొన్నారు.

పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ.. పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నదని చెప్పారు. కార్మికులకు కనీస వేతనం ఐదేండ్లకొకసారి పెంచాల్సి ఉన్నా ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. పని గంటలు పెంచి ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులతో వెట్టి చేయిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు కార్మికులను కట్టు బానిసలుగా చేయాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలని తిప్పికొడుతామని హెచ్చరించారు.

కుల దురహంకార హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- పోలీసుల పాత్రపై నిగ్గు తేల్చాలి
- నిందితులను కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్ కుల దురహంకార హత్యలో పోలీసుల పాత్రపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, కులోన్మాద హంతకులను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం మొగిలిగిద్ద నుంచి ఎల్లంపల్లి వరకు సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. భారీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం మృతుడు ఎర్ర రాజశేఖర్ ఇంటి వద్ద ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ప్రముఖ అడ్వకేట్ సంగమేశ్వర్ అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుల దురహంకార హత్యలను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం తేవాలన్నారు. కుల దురహంకార హత్యల్లో పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలని, పౌర సమాజం కులాంతర వివాహాలను నేరంగా భావించకూడదని చెప్పారు. చిన్న కులాలు అంటే ఎందుకంత కక్ష సాధింపు చర్యలని, ఇలాంటి చర్యలకు పాల్పడకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నిందితుడు కాగుల వెంకటేష్ ఆస్తులను జప్తు చేసి బాధిత రాజశేఖర్ కుటుంబానికి ఇవ్వాలన్నారు. దేశంలో దళితులు అత్యంత ప్రమాదంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లింలు, క్రైస్తవుల వల్ల దళితులపై దాడులు జరగడం లేదని, కేవలం హిందూమతంలో ఉన్న దళితులపై హిందూమతంలో ఉన్న అగ్రకులోన్మాదులు దాడులకు పాల్పడుతున్నట్టు తెలిపారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ.. నిలువ నీడలేని రాజశేఖర్ కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. రాజశేఖర్ భార్య వాణికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే ఐదెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజశేఖర్ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటాలు జరుగుతూనే ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బోడ సామేల్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్, సిపిఎం డివిజన్ కార్యదర్శి ఎన్.రాజు, మాదిగ ఐక్యవేదిక కన్వీనర్ దొడ్డి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ, ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు భిక్షపతి, ఉపాధ్యక్షులు శ్రీనునాయక్, బుద్ధిష్ట బాదేపల్లి సిద్ధార్థ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి. జగదీష్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్, డీఎస్పీ నాయకులు శివ, అనిల్, జాంగారి రవి, కర్రేళ్ల సురేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మరింత గడువు కావాలి

- స్పీకర్‌కు ఎమ్మెల్యే దానం లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదివారం లేఖ రాశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌కు సంబధించి తనకు ఇచ్చిన నోటీసుకు సమాధానం తెలిపేందుకు మరింత గడువు కావాలని కోరారు. ఇప్పటికే రెండు సార్లు దానం నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు ఇచ్చారు.

బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది శాసనసభ్యులకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేయగా.. సమాధానం ఇచ్చిన ఎనిమిది మందిపై విచారణ జరిగింది. దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం నోటీసులపై స్పందించేందుకు మరింత గడువు కావాలని కోరుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ కార్యాలయం విచారణను వేగవంతం చేసింది.

దూకుడుగా నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు

- కార్మికులకు ఉరిగా లేబర్ కోడ్‌లు
- మోడీ ప్రభుత్వం చర్య అప్రజాస్వామికం
- స్వాతంత్రోద్యమ ఆకాంక్షలు నెరవేరలేదు : ఎం.సాయిబాబు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎం సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలను కేంద్ర ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తోందని, దాని కారణంగా దేశం ఆర్థిక సంక్షోభంలో పడిందని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభలు కూకట్ల శంకర్ నగర్‌లోని కిన్నెర కళ్యాణమండపంలో(ఎర్ర శ్రీకాంత్ ప్రాంగణం) ప్రారంభమయ్యాయి. ముందుగా సిఐటియు సీనియర్ నాయకులు ఎంవీ అప్పారావు జెండా ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులు కూకట్ల శంకర్, ఎర్ర శ్రీకాంత్‌కు ఎం.సాయిబాబు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొలగాని కె.బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో 50 కోట్ల కార్మికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వారి హక్కులను హరించేందుకు మోడీ ప్రభుత్వం కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. 8 గంటల పనిదినం స్థానంలో 12 గంటల పని దినాన్ని తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా చేసే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో కార్మికుల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా వ్యవహరించడం తగదని చెప్పారు. స్వతంత్రానికి ముందు ఆ తర్వాత పొందుతున్న హక్కులపై మోడీ ప్రభుత్వం గొడ్డలివేటు వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కింద కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు మరింత హీనస్థాయికి చేరే ప్రమాదం ఉందని అన్నారు. కార్మికులకు సామాజిక భద్రత లేకుండా పోతుందన్నారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏజే.రమేష్, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వరరావు, రుద్ర నాగరాజు, చిట్టిబాబు, కోశాధికారి సత్ర పల్లి సాంబశివరావు, సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు పిట్టల రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి పోతురాజు శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

26న డిమాండ్స్ డే : ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పలు డిమాండ్ల సాధనకు ఈ నెల 26న డిమాండ్స్ డేగా పాటించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) పిలుపునిచ్చింది. ఆదివారం నిర్వహించిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వివిఎస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. డిమాండ్స్ డే రోజు డిమాండ్ బ్యాడ్జెస్ పెట్టుకుని విధులకు హాజరు కావాలని సూచించారు. వెంటనే రీజియన్ కమిటీలు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేస్తూ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్స్‌ను రద్దు చేయాలనీ, విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి ఆర్టీసిలకే ఇవ్వాలనీ, కేంద్ర ప్రభుత్వ లేబర్ పాలసీ " శ్రమ శక్తి నీతి - 2025"ని రద్దు చేయాలని కోరారు. టిజిఎస్ఆర్టీసీలో కార్మిక సంఘాలపై ఉన్న ఆంక్షలు ఎత్తి వేసి గుర్తింపు ఎన్నికలు, సిసిఎస్‌కు ఎన్నికలు జరపాలనీ, రిటైర్ అయిన వారికి రావలిసిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని, 2021, 2025 వేతన ఒప్పందాలను చేయాలని, 2017 అలవెన్సులు సవరించాలని డిమాండ్ చేశారు.

కష్టపడి పండిస్తే.. చెత్తాచెదారమా..?

- ప్రాథేయపడినా వినిపించుకోవడం లేదు
- సిసిఐ చిక్కులు.. పత్తి రైతు తిప్పలు
- తేమశాతం చూడకుండానే తిరస్కరణ
- రాష్ట్రంలోని 380 జిన్నింగ్ మిల్లుల్లో ఏదో ఒక రకంగా ఇబ్బందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

" రెండు బండ్ల పత్తి తీసుకుని తల్లాడ జిన్నింగ్ మిల్లుకు వెళ్లాను. మిల్లు వ్యక్తి వచ్చి శాంపిల్ పరిశీలించాడు. పిడికెడు దూది పట్టుకొని చెత్తాచెదారం ఉంది.. నాణ్యత సరిగా లేదని వెళ్లిపోయాడు. ప్రాథేయపడి మళ్లీ తీసుకొచ్చినా తేమ శాతం చూడకుండా తిరస్కరించాడు. వర్షం వల్ల పంట దెబ్బతిందని వేడుకున్నా వినిపించుకోలేదు. గొడవ చేస్తామోనని పోలీసులను తీసుకొచ్చారు. పోలీసులను, జిన్నింగ్ మిల్లు సిబ్బందిని వేడుకున్నా కనికరించలేదు. తీసుకుపోయిన పంటను వెనక్కు తెచ్చాను. క్వింటాల్‌కు రూ.200 చొప్పున తొక్కుడు కూలి, ఇంకా పత్తి రవాణా వాహనానికి చెల్లించాను. ఇంటికొచ్చాక తొక్కిన పత్తిని ఖాళీ చేసి ఆరబోశాను. "

బాణోత్ లక్మా, పుతానీతండా, రఘునాథపాలెం మండలం

ఈ ఏడాది పత్తి రైతుల కష్టాలు వర్ణనాతీతం. ఎక్కడ చూసినా ఇవే తిప్పలు. పంట ఏరే సమయంలో ఎడతెరపి లేని వర్షాలతో నాణ్యత దెబ్బతింది. ఇదే అదనుగా సిసిఐ కొనుగోళ్లలో రకరకాల కొర్రీలు పెడుతోంది. తేమ శాతం చూడకుండానే వర్షాలకు దెబ్బతిన్న పత్తి నాసిరకంగా ఉందని కొనుగోలు చేయటం లేదు. పత్తి నల్లగా ఉంది.. తేమ శాతం నిబంధనలకు విరుద్ధంగా ఉందని తిరస్కరిస్తున్నారు. ఒక్కో బస్తాకు పది చోట్ల పొడిచి తేమ శాతం అధికంగా ఉందనిపిస్తున్నారు. ఎంత మంచి క్వాలిటీ అయినా ఏదో ఒక రకంగా సిసిఐ తిరకాసు పెడుతుండటంతో చేసేది లేక రైతులు అక్కడే జిన్నింగ్ మిల్లు యజమానులకు అరకొర ధరలకు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని 122 సిసిఐ కొనుగోలు కేంద్రాలు, 380జిన్నింగ్ మిల్లుల్లో ఏదో ఒకరకంగా కొర్రీల తంతు కొనసాగుతోంది. ఖమ్మం జిల్లాలో 9 జిన్నింగ్ మిల్లుల్లో ఆరింట విక్రయాలు సాగుతున్నాయి. వీటిలో రోజుకు పావు శాతం పత్తిని మాత్రమే సిసిఐ కొనుగోలు చేస్తుండగా.. ముప్పావంతు పంటను ప్రయివేటుగా విక్రయించుకోవాల్సిన పరిస్థితి.

ఈ నామ్ ఇక్కట్లు తప్పట్లే..!

రాష్ట్రంలోని పలుమార్కెట్లలో జాతీయ అగ్రి మార్కెట్ విధానం (ఈ నామ్) అమల్లో ఉన్నా రైతులకు ఇక్కట్లు తప్పట్లేదు. ఈ నామ్ విధానంలో కొర్రీలకు తావులేకున్నా ఖరీదుదారులు మాత్రం ఏదో ఒకరకంగా పేచీ పెడుతున్నారు. సిసిఐ కేంద్రాల తీరును పసిగట్టిన వ్యాపారులు కాంటాల సమయంలో పంట నాణ్యత సరిగా లేదని కొర్రీలు పెడుతున్నారు. సీక్రెట్ బిడ్డింగ్‌లో ఎంత ధర రాబోతుందో కేవలం రెండు గంటల ముందే రైతుకు తెలుస్తుండటాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. ఖమ్మం పత్తి యార్డులో ఉన్న ఖరీదుదారులు కమీషన్ పద్ధతిలో గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు పంటను ఎగుమతి చేసే సమయంలో సొమ్ము చేసుకుంటున్న తీరు రైతులనే కాదు కమీషన్‌దారులను సైతం విస్మయానికి గురిచేస్తోంది.

అధిక తేమ పేరుతో కొర్రీలు

తేమ శాతం 12లోపు ఉండాలనేది సిసిఐ నిబంధన. కానీ 11.4శాతం తేమ వచ్చినా సిసిఐ అధికారులు తిరస్కరిస్తున్నారు. ఒకచోట సరిగా వస్తే మరో మూలకు చూడటం.. అక్కడ కూడా బాగుంటే.. మరో చోట ఇలా పలుచోట్ల పరిశీలించి 12శానికి పైగా తేమ ఉందని చెప్పి రిజెక్ట్ చేయటం సాధారణం అయిందని రైతులు వాపోతున్నారు. ఒకవేళ తేమ శాతం నిబంధ మేరకు ఉంటే నాణ్యత పేరుతో తిరికాసు పెడుతున్నారు. చెత్తాచెదారం, నల్లగా ఉందని తిరస్కరిస్తున్నారు. ఆరబెట్టుకు రమ్మని ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఆరబెట్టి తెచ్చినా మళ్లీ ఏదో ఒక కారణం చూపి తిరస్కరిస్తుండటంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకు క్వింటాల్ రూ.6వేల నుంచి 6,500 చొప్పున అమ్ముకుంటున్నారు. ఇష్టారాజ్యంగా జిన్నింగ్ మిల్లు సిబ్బంది తిరస్కరిస్తుండటంతో రైతులు వారితో వాదనకు దిగుతున్నారు. అధికారులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

నాణ్యతను బట్టే నిర్ణయం

పిన్‌రెడ్డి శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్, ఖమ్మం

పత్తి నాణ్యతను వర్గీకరించి సీసీఐ ధరలను నిర్ణయించింది. మీడియం స్టాప్ కాటన్ రూ.7,710, లాంగ్ స్టాప్ కాటన్ రూ.8,110 చొప్పున మద్దతు ధర ప్రకటించింది. ఈ మేరకు నాణ్యత ఉంటేనే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ఏ రైతు సరుకు అయితే తిరస్కరణకు గురైందో.. దాని క్వాలిటీ గురించి తెలియకుండా మాట్లాడలేం కదా..! తేమ శాతం, నాణ్యత ఆధారంగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. నిబంధనల మేరకు క్వాలిటీ, తేమ శాతం ఉన్నా రిజెక్ట్ చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.